మౌలిక సదుపాయాలకు పెద్దపీట

- వైఎస్ఆర్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్
- 38వ వార్డులో రూ.20 లక్షలతో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో కోడుమూరు సమన్వయకర్త సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

కర్నూలు సిటీ: వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తుందని కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డిలు అన్నారు. కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 38వ వార్డులో రూ.20 లక్షలతో డ్రైనేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించిన పనులకు సోమవారం వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో మురుగు కాలువలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గతంలో ఐదేళ్లు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ఏ రోజు ప్రజా సమస్యలను పట్టించుకోలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక వైపు సంక్షేమం... మరో వైపు అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆయనను సీఎంగా చేసుకుంటే పేదలకు మరింత మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో 40వ వార్డు కార్పొరేటర్ విక్రమ్ సింహారెడ్డి, గూడూరు, కర్నూలు జెడ్పీటీసీలు మౌలాలి, ప్రసన్నకుమార్, సింగిల్ విండో చైర్మన్ అమర్నాథ్ రెడ్డి, 38వ వార్డు వైఎస్ఆర్‌సీపీ నాయకులు శేషన్న, సచివాలయ కన్వీనర్ జగన్, షాజహాన్, బి.రాము, యూత్ వింగ్ కార్యదర్శి గిరి ప్రసాద్, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయ బోర్డు సభ్యులు మధు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



హోమం పూజల్లో కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి కుటుంబ సభ్యులు

కర్నూలు కల్చరల్: గంగ పుత్ర సంఘం ఆధ్వర్యంలో పెద్దపాడు రోడ్‌లోని శ్రీ గంగా భవాని ఆలయంలో సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. గణపతి పూజ, పంచామృతాభిషేకం, ప్రాణ ప్రతిష్ట, హోమాలు నిర్వహించారు. కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయ నిర్మాణ దాత గువ్వల గంగాధర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌యూకు నూతన పీఆర్వోలు



నూతన పీఆర్‌ఓలకు నియామక పత్రం అందజేస్తున్న వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పబ్లిక్ రిలేషన్స్ అధికారులుగా వర్సిటీ తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.రవిశంకర్, సైన్స్ కళాశాల జూనియర్ అసిస్టెంట్ జి.సురేంద్రబాబును నియమించారు. సోమవారం వారికి వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్ కుమార్ నియామక పత్రం అందజేశారు. వర్సిటీలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు, విద్యా విషయక కార్యక్రమాలను ఎప్పటికప్పుడు జిల్లా ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని వీసీ ఆదేశించారు.

నేడు సీ క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 27న కర్నూలు నగరంలోని సీ.క్యాంపు రైతుబజారును ఒక్కరోజు బంద్ చేస్తున్నట్లు ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే రైతుబజారులో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా మంగళవారం సెలవు ప్రకటించినట్లుగా వారు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, వినియోగదారులు గమనించాలని కోరారు. బుధవారం నుంచి రైతుబజారు యథావిధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

29న 'వింధ్య' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: క్లస్టర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ సాయంత్రం 4 గంటలకు స్థానిక సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో ప్రముఖ రచయిత ఎస్.డి.వి. అజీజ్ రచించిన 'వింధ్య ' (రేడియో నాటికల సంపుటి) పుస్తకావిష్కరణ జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.సుబ్రహ్మణ్య కుమార్ తెలిపారు. క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్. సాయి గోపాల్ పుస్తకావిష్కరణ చేస్తారని తెలిపారు. ప్రముఖ రచయిత ఎస్.ఎం.డి. ఇనాయతుల్లా పుస్తక సమీక్ష చేస్తారని పేర్కొన్నారు

అక్రమ నిర్మాణాన్ని ఆపాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని ముజఫర్ నగర్‌లో రోడ్డు స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన ఇంటి నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కర్నూలు నగర పాలక సంస్థ ఎదుట ఆందోళన నిర్వహించి కమిషనర్ భార్గవ్‌తేజకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రామన్న అనే వ్యక్తి కమ్యూనిటీ హాలు ఎదుట ఉన్న రోడ్డు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారన్నారు. ఈ నిర్మాణ పనులు పూర్తి అయితే రహదారి ఇరుకుగా మారి ప్రజలకు తీవ్ర ఆటంకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.నిర్మల, కె.సుధాకరప్ప, హుస్సేన్ బాష పాల్గొన్నారు.

మహిళా ఐక్యవేదిక అధ్యక్షురాలిగా పాలెం రాధ



పాలెం రాధకు జిల్లా అధ్యక్షురాలిగా నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక కర్నూలు జిల్లా అధ్యక్షురాలుగా పాలెం రాధ (బోయ)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, రాయలసీమ అధ్యక్షురాలు ఈడిగ భారతమ్మ వెల్లడించారు. సోమవారం ఆ ఐక్య వేదిక కార్యవర్గ సమావేశాన్ని స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలుగా పాలెం రాధను ప్రకటించి నియామకపత్రం అందజేశారు.

'స్పందన' సమస్యల పరిష్కారానికి చర్యలు

- కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ. భార్గవ తేజ



'స్పందన' కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవతేజ

కర్నూలు (న్యూటౌన్): 'స్పందన' కార్యక్రమం దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవతేజ అన్నారు. సోమవారం కర్నూలు మున్సిపల్ హాల్‌లో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. నగరానికి చెందిన పలువురు వివిధ సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

వినతుల్లో కొన్ని..

- వెంకటాద్రినగర్‌లో డ్రైనేజీ కాల్వ, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని ఆ కాలనీకి చెందిన హేమలత కోరారు.
- బంగారుపేటలో తాగునీటి ఎద్దడితో ఇబ్బందిపడుతున్నామని ఆ ప్రాంతానికి చెందిన హుస్సేన్‌పీరా విన్నవించారు.
- తమకు స్థిర నివాసం లేదని, టిడ్కో గృహాల్లో ఒక గృహాన్ని కేటాయించాలని ఛత్రిబాగ్‌కు చెందిన మహేశ్వరి, కొత్తపేటకు చెందిన ఉసేన్‌బీ కమిషనర్‌ను కోరారు.
- తమ కాలనీలో నెలకొన్న తాగునీటి, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని తుంగభద్ర కాలనీకి చెందిన రవికాంత్ మునిసిపల్ అధికారులకు విన్నవించారు.
- స్పందన కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఈ వేణుగోపాల్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ మంజులమ్మ, దామోదర్, ఎంహెచ్ఓ విశ్వేశ్వరరెడ్డి, సెక్రటరీ, శానిటరీ సూపర్ వైజర్ నాగరాజు, ఆర్ఐ ఖలీల్, మేనేజర్ చిన్న రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరకు చట్టరూపం కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ర్యాలీని ప్రారంభిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు ప్రభాకరరెడ్డి, జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించేందుకు చట్టరూపం కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శులు కె.ప్రభాకరరెడ్డి, కె.జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీలో జరుగుతున్న రైతు పోరాటానికి మద్దతుగా కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో వారు నగరంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టరేట్ దగ్గర వారు జెండా ఊపీ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం రైతు ఉద్యమాన్ని అణచివేసే చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులపై లాఠీచార్జీ చేయడం, బుల్లెట్ల వర్షం కురిపించి ప్రాణాలు తీయడం అన్యాయమన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీసర్కారుకు తగినబుద్ధి చెప్పడానికి కార్మిక, రైతు సోదరులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మునెప్ప, అంజిబాబు, చంద్రశేఖర్, పంపన్నగౌడ్, శ్రీనివాసరావు, సురేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

సగరులను రాజకీయంగా గుర్తించాలి



ఢిల్లీకి వెళ్లేందుకు కర్నూలు రైల్వే స్టేషన్‌కు చేరుకున్న సగరులు

కర్నూలు(అర్బన్): దేశంలో 20 నుంచి 25 కోట్ల జనాభా కలిగిన సగరులను రాజకీయంగా గుర్తించాలని జిల్లా శ్రీ భగీరథ సగర/ ఉప్పర సంఘం అధ్యక్షుడు బి.సత్యన్న డిమాండ్ చేశారు. ఈ నెల 29వ తేదీన ఢిల్లీ రాంలీలా మైదానంలో భారత భగీరథ జన కళ్యాణ యాత్రలో భాగంగా నిర్వహించే బహిరంగసభలో పాల్గొనేందుకు సోమవారం కర్నూలు రైల్వే స్టేషన్ నుంచి జిల్లా సగరులు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా బి.సత్యన్న మాట్లాడుతూ దేశమంతా సగరులను ఒకే పేరుతో పిలవాలని, రాజకీయంగా గుర్తించాలని ఢిల్లీ వేదికగా నినదించనున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి యూకే వీరేంద్ర, నాయకులు ఏపీ వీరన్న, రామచంద్ర, ఎమ్మిగనూరు సంఘం అధ్యక్షుడు, టౌన్ బ్యాంకు చైర్మన్ యూకే రాజు, మాజీ అధ్యక్షుడు డి. రాముడు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

ఈ నెల 25వ తేదీన కర్నూలులో హత్యకు గురైన ఆటో డ్రైవర్ ఉప్పరి సాయి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సంఘం నేతలు కోరారు. ఈ సంఘటనకు సంబంధించి హంతకులను గుర్తించి వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. సాయి హత్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

షూటింగ్ బాల్ మేనేజర్‌గా పరుశరాముడు



కర్నూలు (టౌన్): వచ్చే నెల 2, 3 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో వరల్డ్ కప్ షూటింగ్ బాల్ పోటీలకు భారత జట్టు మేనేజర్‌గా జిల్లాకు చెందిన పరుశరాముడు నియమితులయ్యారు. ఈమేరకు షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి జనరల్ రవీంద్ర సింగ్ తోమర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పరుశరాముడు ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గతంలోనూ ఈయన ఏషియన్ పోటీలకు భారత జట్టు కోచ్‌గా వ్యవహరించారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



దేవదాయశాఖమంత్రి కొట్టు సత్యనారాయణకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1వ తేది నుంచి 11వ తేది వరకు జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ అధికారులు పలువురు ప్రముఖులకు పత్రికలను అందజేసి ఆహ్వానించారు. సోమవారం తాడెపల్లిల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టుసత్యనారాయణను కలిసి ఆహ్వానించారు. అలాగే నంద్యాలలో జిల్లా న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరావును, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎస్పీ రఘువీర్‌రెడ్డిలను ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు, పర్యవేక్షకులు స్వాములు, అర్చకులు, వేదపండితులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. ప్రముఖులకు వేదపండితులు వేదాశీర్వచనంతో స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

మల్లన్నకు నృత్యనీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన అర్చన, బృందం వారు సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో గణేశ పంచరత్నము, శివాష్టకం, శంభో..భో..శంభో, కాలభైరవాష్టకం తదితర గీతాలకు, అష్టకాలకు ఆధ్య, సహస్ర, వైష్ణి, కృతి, మనస్వి, విజ్ఞ, తన్వీశ్రీ, సహస్ర ప్రణవి, అక్షర, స్నిగ్ధ తదితరులు నృత్యం చేశారు.

వైద్యాధికారులకు నోటీసులు

మహానంది: రికార్డులు సక్రమంగా నిర్వహించుకోలేకపోతే ఎలా అంటూ ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ బి.రవీంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బండిఆత్మకూరు మండలంలోని జి.లింగాపురంలోని సబ్ సెంటర్, నారాయణపురం ప్రైమరీ హెల్త్ సెంటర్లలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లింగాపురం సబ్‌సెంటర్‌లో రికార్డులు సరిగా మెయింటైన్ చేయకపోవడంతో మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బందికి సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీ చేశారు

వైభవంగా పార్వతీపరమేశ్వరుల గ్రామోత్సవం



శివపార్వతుల ఊరేగింపులో శివభక్తులు



గ్రామోత్సవంలో మాట్లాడుతున్న గురుస్వాములు

కర్నూలు కల్చరల్: పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. భారతీ మాత ఆధ్వర్యంలో గురు స్వామి బీవీ కృష్ణారెడ్డి శిష్య బృందం సోమవారం స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయం శివ శక్తి పీఠం నుంచి కలెక్టరేట్, గాయత్రీ ఎస్టేట్ మీదుగా బిర్లామందిర్ వరకు శివ స్వాములు శివపార్వతుల ఉత్సవాల విగ్రహాలను ఊరేగించారు. ఓం నమఃశివాయ అంటూ శివయ్య భజనలు చేశారు. అనంతరం భక్తులకు అల్పాహార ప్రసాదం వితరణ చేశారు. గురుస్వామి రాఘవేంద్రారెడ్డితో పాటు పెద్ద ఎత్తున శివ భక్తులు పాల్గొన్నారు.

'ఎవరి కోసమో పనిచేయాల్సిన అవసరం లేదు'

కర్నూలు(సెంట్రల్): ఎవరి కోసమో పని చేయాల్సిన అవసరం తమ పార్టీకి లేదని, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసమే పనిచేస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. సోమవారం 'సాక్షి'లో వచ్చిన టీజీ గూడు పుఠాణి కథనంపై ఆ పార్టీ నాయకులు స్పందించారు. సీఆర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పేదలకు కూడు, గూడు ఇవ్వాలన్న లక్ష్యంతో అనేక భూ పోరాటాలు చేస్తున్నామన్నారు. బి.తాండ్రపాడు సమీపంలో పేదల కోసం భూపోరాటం చేస్తే.. అందులో టీజీ భరత్‌కు అనుకూలంగా సీపీఐ వ్యవహరించిందని రాయడాన్ని తాము ఖండిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పార్టీ నేతలు రామకృష్ణారెడ్డి, జగన్నాథం, పంపన్నగౌడ్, సోమన్న పాల్గొన్నారు.

అడవుల రక్షణ అందరి బాధ్యత

పాణ్యం: అడవులను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అటవీశాఖ క్షేత్రసహాయ అధికారి సుబ్బరాయుడు అన్నారు. సోమవారం పాణ్యం చెంచుకాలనీ, సుగాలి మెట్ట గ్రామాల్లో గిరిజనులకు అడవుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అడవుల వల్ల మానవాళికి కలిగే ప్రయోజనాలను వివరించారు. వేసవి నేపథ్యంలో అడవులకు నిప్పు అంటుకోకుండా చూసుకోవాలని సూచించారు. అడవులు, సరిహద్దు ప్రాంతాల్లో నిప్పు అంటించవద్దని.. దాని వల్ల అడవులతో పాటు వన్యప్రాణుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. అడువుల సంరక్షణకు సహకరించాలని కోరారు. కళాజాత బృందం సభ్యులు తమ పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల పల్లవి, డీఆర్ఓ చంద్రహాస్, జమాల్‌వలి, అబ్దుల్‌కలాం, మహేష్, రవి, చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సుంకలమ్మ ఆలయానికి బారికేట్లు వితరణ

గూడూరు రూరల్: మండలంలోని కె.నాగలాపురం గ్రామ దేవత సుంకులా పరమేశ్వరీదేవి ఆలయానికి సోమవారం కోరమండల్ గ్రోమోర్ ఇంటర్నేషనల్ కంపెనీ అధికారులు 8 బారికేట్లను వితరణ చేశారు. కంపెనీ జోనల్ మేనేజర్ గోవిందరావు, ఆగ్రో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ శ్రీధర్ వాటిని ఆలయ కమిటీ చైర్మన్ ఉమామహేశ్వరమ్మకు అందజేశారు. ఎస్ఐ శ్రీనివాసులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సహాయం



సుధీర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ నాగేశ్వరయ్య

కర్నూలు (హాస్పిటల్): నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న జీఎస్ఆర్ హాస్పిటల్‌లో పని చేసే సుధీర్ ఆకస్మికంగా మరణించడంతో అతని కుటుంబానికి హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగేశ్వరయ్య రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

పొగాకు ఉత్పత్తులతో అనర్థాలు



పొగాకు ఉత్పత్తుల అనర్థాల గురించి తెలిపే పోస్టర్ విడుదల చేస్తున్న డాక్టర్ శైలేష్ కుమార్

కర్నూలు (హాస్పిటల్): పొగాకు ఉత్పత్తులను వాడటం వల్ల తీవ్ర అనర్థాలు వస్తాయని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారి డాక్టర్ శైలేష్ కుమార్ చెప్పారు. సోమవారం నగర శివారులోని నూతనపల్లె గ్రామం మండల ప్రజాపరిషత్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు వాడటం వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించారు. పొగాకు ఉత్పత్తుల్లో ఎన్నో విష పదార్థాలు ఉన్నాయని, సరదాగా మొదలయ్యే ఈ అలవాటు తర్వాత వ్యసనంగా మారి ప్రాణాలు తీస్తోందన్నారు. పొగాకు ఉత్పత్తులను సేవించడం ద్వారా ప్రమాదకర వ్యాధులు వస్తాయని హెచ్చరించారు. శరీరంలో అన్ని అవయవాలతో పాటు ఊపిరితిత్తులు త్వరగా దెబ్బతింటాయన్నారు. పొగ తాగే వారి పక్కన ఉన్నవారు సైతం ప్రభావితమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. పొగ తాగడం వల్ల నోటి దుర్వాసన, గొంతు వ్యాధులు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్, కఫం, దగ్గు, ఆయాసం, రక్తపోటు, క్యాన్సర్ వ్యాధులు వచ్చే ప్రమాదముందన్నారు. అనంతరం ఫ్లోరోసిస్ గురించి కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డాక్టర్ జె.నిర్మల, సత్యనారాయణ, మల్లికార్జున, జయనాగమణి పాల్గొన్నారు.

మల్టీ యుటిలిటీ నాలెడ్జ్ సెంటర్‌కు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కళాశాల మైదానంలో మల్టీ యుటిలిటీ నాలెడ్జ్ సెంటర్‌కు భూమి పూజ జరిగింది. కళాశాల మైదానంలో ప్రభుత్వం కేటాయించిన 60 సెంట్ల భూమిలో దీనిని నిర్మిస్తున్నారు. ఇందుకోసం రూ.35 కోట్ల వరకు అంచనాను రూపొందించారు. ఈ భవనంలో వైద్య విద్యార్థులకు ఉపయోగపడేలా డిజిటల్ లైబ్రరీ, ఇంటర్నేషనల్ జనరల్స్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, రీసెర్చ్ సెంటర్, రెస్ట్ రూమ్స్ తదితర సౌలభ్యాలు ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, అమెరికా నుంచి వచ్చిన పూర్వ విద్యార్థి డాక్టర్ సదాశివరెడ్డి, కేఎంసీ గ్రాడ్యుయేట్స్ ట్రస్ట్ సెక్రటరీ డాక్టర్ ఎ.రామలింగారెడ్డి, డాక్టర్ అమానుల్లా, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు, డాక్టర్ బి.కుమారస్వామి రెడ్డి, సెక్రెటరీ డాక్టర్ బి.బాలమద్దయ్య, ట్రెజరర్ డాక్టర్ ఎం.మహేశ్వరరెడ్డి, డాక్టర్ కేజీ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

కోడుమూరు రూరల్: చౌడేశ్వరిదేవి తిరునాలను పురస్కరించుకుని సోమవారం కోడుమూరు బాలుర హైస్కూల్ మైదానంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను హెచ్ఎం తైమూర్‌బాషా, ఉపాధ్యాయుడు రషీద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం అలవడుతుందని తెలిపారు. క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. పీడీ సురేంద్రనాయుడు మాట్లాడుతూ.. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు మొత్తం 16 జట్లు వచ్చాయని, మొదటి బహుమతిగా రూ.20 వేలు, 2వ బహుమతిగా రూ.10 వేలు, 3వ బహుమతిగా రూ.5 వేలను దాతల సహకారంతో అందజేస్తామన్నారు.

వెలగమాను డ్యాం పనులు పూర్తి చేయండి

గడివేముల: అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు సాగునీరు అందించేందుకు నిర్మించనున్న వెలగమాను డ్యాం కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. సోమవారం గడివేముల మండల పరిధిలోని పెసరవాయి, కరిమద్దెల, గడివేముల రైతులతో కలిసి కేసీ కెనాల్‌ను పరిశీలించారు. వెలగమాను డ్యాం పూర్తయితే సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని తెలిపారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులను చేపట్టి వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సునీల్ రెడ్డి, దామోదరరెడ్డి, సంజీవరెడ్డి, క్రిష్టారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, డేవిడ్, శేషన్న పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.188 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

గ్రామాల్లోనే సమస్యలపై ప్రత్యేక దృష్టి



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

ఓర్వకల్లు: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ మల్లీశ్వరి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. 2024–2025 వార్షిక కాలానికి సంబంధించి గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ప్రధానంగా ప్రజలకు అవసరమైన తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. తిప్పాయపల్లె, శకునాల, కన్నమడకల, ఓర్వకల్లు, కేతవరం తదితర గ్రామాల్లో నీటి సమస్య ఉన్నట్లు తెలిసిందన్నారు. ఆయా గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎంపీపీ తిప్పన్న, వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఫాతిమాబీ, పుల్లయ్య, కుసుమలత, సరోజమ్మ పాల్గొన్నారు.